క్లుప్తంగా

ఘనంగా అయ్యప్ప ఆరట్టు ఉత్సవం



అయ్యప్ప ఆరట్టు సేవలో స్వాములు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం ఆరట్టు ఉత్సవంలో భాగంగా అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహంతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన గురుస్వామి భద్రయ్య, బాదె శ్రీనివాస్, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

ఆలయంలో పునరుద్ధరణ పనులు



కొనసాగుతున్న పనులు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని రాయదండి గ్రామంలో స్వయంభూగా వెలిసిన శ్రీచిలుకల రామేశ్వరాలయంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో మార్వాడీ సేవ సమాజ్ వారి సహకారంతో ఆధునికీకరణ పనులు చేపట్టారు. ఇందులో భాగంగానే ఆంజనేయస్వామి ఆలయంలో టైల్స్ వేసే పనులు ముమ్మరంగా చేస్తున్నారు. భక్తుల కోసం సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ తోకల కుమార్ తెలిపారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు



మాట్లాడుతున్న పాస్టర్

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని కమాన్ ప్రాంతంలో (8వ వార్డు) శుక్రవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను కౌన్సిలర్ బొంకూరి భాగ్యలక్ష్మి, ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బొంకూరి సురేందర్ సన్నీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ క్రైస్తవ సందేశాన్ని వినిపించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష, ట్రాన్స్‌కో ఎస్‌ఈ బొంకూరి సుదర్శన్, ఏఈ రవీందర్, నాయకులు మస్రత్, సాబీర్ ఖాన్, శారద, స్వప్న ఉన్నారు.

ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు



గరుడాంజనేయస్వామి ఆలయం

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని గంగారం గరుడాంజనేయ స్వామి ఆలయంలో 23 నుంచి 25వ తేదీ వరకు గణపతి, నాగదేవత, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. 24న కుంకుమపూజలు, 25న విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఉంటాయి.

విశ్వభారతిలో గణిత ఎగ్జిబిషన్



ప్రదర్శనలతో విద్యార్థులు

జ్యోతినగర్: విశ్వభారతి హైస్కూల్‌లో గణిత ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. శుక్రవారం ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలోని విశ్వభారతి హైస్కూల్‌లో శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా జాతీయ మ్యాథమెటిక్స్ డే నిర్వహించారు. విద్యాసంస్థ చైర్మన్ బందారపు యాదగిరిగౌడ్ పాల్గొన్నారు. విద్యార్థుల ప్రదర్శనలు తిలకించి అభినందించారు. మ్యాథ్స్ టీచర్లను సత్కరించారు. హెచ్‌ఎం తిరుపతిగౌడ్, ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

కమాన్‌పూర్: మండలంలోని సిద్దిపల్లె గ్రామం నాలుగో వార్డులో సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. సీసీరోడ్డు నిర్మాణం కోసం రూ.4లక్షల నిధులు మంజూరు కాగా సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు బిల్లా కృష్ణ, తాటికొండ రాయమల్లు, బిల్లా వెంకటేశ్, చిప్పకుర్తి శ్రీనివాస్, నరేశ్, శ్రీధర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

డివిజన్‌కో సమస్య.. అడుగుకో గుంత

- ప్రమాదకరంగా ప్రధాన రహదారి
- గుంతలమయంగా మల్కాపూర్ రోడ్డు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు, వాహనదారులు



గుంతలమయంగా ఉన్న రోడ్డులో వాహనాల రాకపోకలు(ఫైల్)

జ్యోతినగర్: రామగుండం నగర పరిస్థితి చూస్తుంటే డివిజన్‌కో సమస్య, రోడ్డుకో గుంత అన్నట్లు ఉంది. కార్పొరేషన్ ఐదో డివిజన్‌లోని మల్కాపూర్ ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయంతో పాటు ఇరుకుగా మారి ప్రజల, వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రాత్రి సమయాల్లో రోడ్డుపై ఉన్న గుంతల్లో వాహనాలు పడిపోయి ప్రమాదాలకు గురైన వారు చాలా మంది ఉన్నారు. తొమ్మిదేళ్ల క్రితం నిర్మించిన రోడ్డు ప్రస్తుతం గుంతలమయంగా మారిపోయింది. రామగుండం పోలీస్ కమిషనరేట్, ఎన్టీపీసీ సంస్థలో రక్షణ విధులు నిర్వహించే సీఐఎస్‌ఎఫ్ బ్యారెక్స్, శ్రీనగర్‌కాలనీ, మల్కాపూర్‌కు వెళ్లే మార్గంగుండా రోజూ వాహనాల రాకపోకలతో రోడ్డు రద్దీగా ఉంటుంది.

వినతిపత్రాలు బుట్టదాఖలు..

రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానిక నాయకులు, ప్రజలు మున్సిపల్ అధికారులతో పాటు జిల్లా కలెక్టర్‌కు ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందించారు. ఇప్పటికీ వాటి అమలుకు నోచుకోవడం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టినా రోడ్డు నిర్మాణానికి మోక్షం లభించడం లేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణం జరుగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు నిర్మాణానికి.. బూడిద పైప్‌లైన్‌కు లింక్

ఎన్టీపీసీ రామగుండం పునరావాస ప్రాంతాలుగా ఉన్న క్రమంలో సామాజిక సేవా బాధ్యత పథకం (సీఎస్సార్) ద్వారా రోడ్డు నిర్మాణానికి నిధులు సైతం కేటాయించారు. మల్కాపూర్ రోడ్డు మార్గంలో ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టుకు సంబంధించిన బూడిద పైప్‌లైన్ ఓసీపీ–4 వరకు బూడిదను తరలించేందుకు పైప్‌లైన్ నిర్మించేందుకు ప్రణాళికలు సైతం సిద్ధం చేశారు. స్థలాన్ని సైతం సంస్థ సేకరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రజలు కూడా రోడ్డు నిర్మించాలని ఆందోళనలు చేపట్టారు. మల్కాపూర్ రోడ్డును ఎన్టీపీసీ వారు నిర్మిస్తున్నారని, బూడిద పైపులైన్‌కు అవసరమైన స్థలాలు ఇవ్వాలని మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. పాలకులు, అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని మల్కాపూర్ రోడ్డుకు బూడిద పైపులైన్‌కు ఉన్న లింక్‌ను పక్కకు పెట్టి రోడ్డు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గుంతలతో ప్రమాదం



రాజీవ్ రహదారిని ఆనుకుని ఉన్న మల్కాపూర్ రోడ్డును వెడల్పు చేయడంతో పాటు కొత్త రోడ్డును వెంటనే నిర్మించాలి. గుంతలతో రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది బస్సులు, రామగుండం పోలీస్ కమిషనరేట్ మెయిన్ గేట్ ఉండటం, రోడ్డు ఇరుకుగా ఉండటంతో ఇబ్బంది పడుతున్నాం. – యూసఫ్, శ్రీనగర్‌కాలనీ

రోడ్డుకు, పైప్‌లైన్‌కు లింకేంటి



ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు నిర్మించాల్సిన రోడ్డుకు బూడిద పైపులైన్‌కు లింకేంటి అనేది మాకు అర్థం కావడం లేదు. ప్రజల అవసరాలను గుర్తెరిగి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంది. వెంటనే సమస్యలు పరిష్కరించాలి. – భూమయ్య, శ్రీనగర్‌కాలనీ, రామగుండం కార్పొరేషన్

ఘనంగా శ్రీనివాస రామానుజన్ జయంతి



కమాన్‌పూర్: ఆపిల్ కిడ్స్ పాఠశాలలో..



కాల్వశ్రీరాంపూర్: పెగడపల్లి జెడ్పీ హైస్కూల్లో..



పాలకుర్తి: ఆలీవర్ పాఠశాలలో..



గోదావరిఖనిటౌన్: కేక్ కటింగ్..



సుల్తానాబాద్: 1729 ఆకారంలో విద్యార్థులు

పెద్దపల్లి జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో శుక్రవారం గణిత దినోత్సవం, శ్రీనివాస రామానుజన్ జయంతి నిర్వహించారు. మ్యాథమెటిక్ మాంత్రికుడు శ్రీనివాస రామానుజన్ అని పలువురు పేర్కొన్నారు. పాఠశాలల్లో రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రంగవల్లి వ్యాసరచన, క్విజ్, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతి అందించారు. – సాక్షి నెట్‌వర్క్



పెద్దపల్లిరూరల్: కాసులపల్లి ట్రినిటీ స్కూల్‌లో..



ఓదెల: పొత్కపల్లిలో రంగవల్లి పోటీలు

సింగరేణిలో ఆరుగ్యారంటీలు అమలు చేస్తాం



కండువా కప్పుతున్న సదానందం

గోదావరిఖని: తమ యూనియన్‌ను గెలిపిస్తే ఆరు గ్యారెంటీలను సింగరేణిలో అమలు చేస్తామని ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు సదానందం అన్నారు. శుక్రవారం జీడీకే–11, జీడీకే–2ఏ గనులపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణిలో రాజకీయం జోక్యం పెరిగిందని, ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నారని, దీన్ని కార్మికులు గమనించాలని కోరారు. క్యాడర్ స్కీం సరికావాలన్నా, ప్లేడేలు గతంలో ఎన్–1 లేకుండా అమలు కావాలన్నా, మారుపేర్ల సవరణలు, మెరుగైన జీతభత్యాలు రావాలన్నా ఐఎన్‌టీయూసీ గెలవాలన్నారు. చివరగా సింగరేణి బ్రతకాలంటే అనుభవం ఉన్న నాయకత్వాన్ని ఎన్నుకోవాలన్నారు. ఈ నెల 27న జరిగే ఎన్నికల్లో గడియారం గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈసందర్భంగా పలువురు యూనియన్‌లో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు దేవులపల్లి రాజేందర్, ఆరేపల్లి శ్రీనివాస్, అన్వేశ్, బూర జగన్, నీరటి సాగర్, గుండెటి శ్రీనివాస్, ఎదులాపురం శ్రీనివాస్, ఉడుత నాగరాజు, మహేశ్‌బాబు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చుతాం



మాట్లాడుతున్న ముత్యంరావు

గోదావరిఖని: సింగరేణి కార్మికుల సొంతింటి కల నెరవేర్చుతామని సీఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు హామీ ఇచ్చారు. శుక్రవారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణి ఎన్నికల్లో సీఐటీయూ 12 హామీలతో ముందుకు వచ్చిందన్నారు. ఇన్‌కంట్యాక్స్ రియింబర్స్‌మెంట్ చేసేలా చూస్తామన్నారు. కార్మిక కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. గనుల్లో క్యాంటీన్లను ఆధునీకరిస్తామని అన్నారు. తమ వస్తువులను దాచుకునేందుకు గనులపై లాకర్ సౌకర్యం కల్పిస్తామన్నారు. రానున్న రోజుల్లో సీఐటీయూ ఇచ్చిన ప్రతీ హామీని తప్పక నెరవేరుస్తామని చెప్పారు. సమావేశంలో నాయకులు అసరీ మహేశ్, శివరాంరెడ్డి, దుర్గాప్రసాద్, బూరుగు రాములు, తుమ్మ లక్ష్మణ్, శివరామకృష్ణ రాజు, రాములు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

రామగిరి: మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని సర్పంచ్ గంట పద్మ కోరారు. సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన వృత్తి శిక్షణ కేంద్రాన్ని మండల కేంద్రంలో సర్పంచ్ ప్రారంభించి మాట్లాడారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించడానికి ఉచిత శిక్షణ అందిస్తున్నారని తెలిపారు. మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి, ఎంపీటీసీ కొట్టే సందీప్, ఉపసర్పంచ్ కనుకయ్య, సేవా కార్యదర్శి మల్లీశ్వరి,

మహిళా సాధికారతపై అవగాహన సదస్సు

కాల్వశ్రీరాంపూర్: మండల సమాఖ్యలో మహిళా సాధికారతపై శుక్రవారం మహిళలకు సఖి కేంద్రం సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్ దారవేన స్వప్న అవగాహన సదస్సు నిర్వహించారు. గృహహింస, వరకట్న వేధింపులు, మహిళలపై అత్యాచారాలు, లైంగిక వేధింపులు, పని స్థలాల్లో వేధింపులు, సైబర్ క్రైం గురించి మహిళలకు వివరించారు.

కృషితో ఉన్నత విజయాలు సాధించవచ్చు



క్రిస్మస్ వేడుకల్లో చిన్నారులు

జ్యోతినగర్: పట్టుదల, ఎడతెగని కృషితో అత్యున్నత విజయాలను సాధించవచ్చని మందమర్రి కార్మెల్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ ఫాదర్ జేవియర్ రెక్స్ అన్నారు. శుక్రవారం ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని సెయింట్ క్లేర్ హైస్కూల్‌లో జరిగిన క్రిస్మస్ సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన క్రిస్మస్ నాటిక, నృత్యాలు ఆకట్టుకున్నాయి. విజేతలైన విద్యార్థులకు బహుమతి అందించారు. ప్రిన్సిపాల్ ఫాదర్ ఎ.డామినిక్, ఫాదర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

నియామకం

ధర్మారం: కాంగ్రెస్ సేవాదళ్ మండల అధ్యక్షుడిగా మండలంలోని పెర్కపల్లికి చెందిన అచ్చె మహేశ్, జిల్లా అధ్యక్షుడు బొల్లి స్వామి ఉత్తర్వులు జారీ చేశారు.

సలార్ చిత్ర ప్రదర్శనలో అంతరాయం



ప్రొజెక్టర్ గదివైపు వెళ్తున్న అభిమానులు

గోదావరిఖనిటౌన్: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని బొగ్గు గనుల్లో చిత్రీకరించిన ప్రభాస్ నటించిన సలార్ చిత్రం శుక్రవారం విడుదలైంది. స్థానిక ఊర్వశి థియేటర్‌లో ఉదయం ప్రారంభమైన ఫ్యాన్స్ షోలో అర్ధగంట అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రేక్షకులు ఒక్కసారిగా రెచ్చిపోయారు. కేకలతో బెంబేలిత్తించారు. ప్రొజెక్టర్‌కు విద్యుత్‌సరఫరా అయ్యే కేబుల్ తెగిపోవడంతో ఈ అంతరాయం ఏర్పడినట్లు నిర్వాహకులు తెలిపారు. టెక్నికల్ సిబ్బంది కేబుల్‌ను పునరిద్ధరించడంతో షో మళ్లీ కొనసాగింది. అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రజలు మోడీ పాలననే కోరుకుంటున్నారు



పథకాల గురించి వివరిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: పీఎం మోడీ సారథ్యాన్నే దేశ ప్రజలంతా కోరుకుంటున్నారని బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి బాల్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లి మండలం దేవునిపల్లి లక్ష్మీనర్సింహస్వామి ఆలయం వద్ద గ్రామస్తులతో సమావేశమయ్యారు. బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. పేదలందరికీ ఉచితంగా రేషన్ బియ్యం అందిస్తున్నారన్నారు. ఉజ్వల పథకం కింద రాయితీపై గ్యాస్ సిలిండర్‌ను అందిస్తున్నారని, కోవిడ్ సమయంలో అందరికీ ఉచితంగా వ్యాక్సిన్ ఇప్పించారని పేర్కొన్నారు. సదానందం, రవికుమార్, లావణ్య, రజనీ, సుజాత, శ్రీనివాస్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



రామగుండం: ప్రచారం చేస్తున్న బీజేపీ ప్రతినిధులు

రామగుండం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును శుక్రవారం అంతర్గాం మండల పరిధిలోని సోమనపల్లిలో భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా ప్రత్యేక ప్రచార రథం ద్వారా అవగాహన కల్పించారు. బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాలారెడ్డి మాట్లాడుతూ పీఎం మోడీ నిరుపేద ప్రజలకు కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో ముఖ్యంగా మహిళలకు జీరో బ్యాలెన్స్‌తో జన్‌ధన్ బ్యాంకు ఖాతాలు, ఐదేళ్ల పాటు ఉచిత రేషన్ బియ్యం పంపిణీ తదితర పథకాల గురించి వివరించారు. అనంతరం సంక్షేమ పథకాలతో కూడిన పోస్టర్లను ఆవిష్కరించారు. సోమనపల్లి కార్యదర్శి కల్వల ఝాన్సీ, ఉమాదేవి, శ్రీలత, రత్నకుమారి, రాజేశ్వరి, లక్ష్మణ్ ఉన్నారు.

వికసిత్ భారత్ సంగ్రమ యాత్ర

ధర్మారం: పీఎం మోడీ ప్రారంభించిన వికసిత్ భారత్ సంగ్రామ యాత్ర శుక్రవారం ధర్మారం మండలం గోపాల్‌రావుపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా 2024 క్యాలెండర్‌ను ప్రజలకు పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ప్రవేశపెట్టిన పథకాల వివరాలు బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకాల గురించి ప్రజలకు వివరించారు. సర్పంచ్ జనగామ అంజయ్య, బీజేపీ నాయకులు సందనవేని లక్ష్మణ్, జనగామ సంజీవ్, సిరిపురం రాజేశం మహేశ్, సుదర్శన్ పాల్గొన్నారు.

కమాన్‌పూర్ మండలంలో..

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లిలో బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన భారత్ సంకల్ప యాత్ర శుక్రవారం గ్రామానికి చేరుకుంది. యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొల్లపెల్లి శంకర్‌గౌడ్, వైద్య, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో కళాకారుల ప్రదర్శన

ముత్తారం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి, ఆరోగ్యశ్రీ పథకాలపై శుక్రవారం మండలంలోని మైదంబండ, పోతారంలో కళాకారులు తమ ఆటపాటలతో అవగాహన కల్పించారు. మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఉచిత ప్రయాణంతో కలిగే లాభాల గురించి వివరించారు. కళాకారులు ఇల్లందుల మల్లేశ్‌గౌడ్, బుర్ర శంకర్‌గౌడ్, కొండ్ర వెంకన్నగౌడ్, సలెంద్ర రాజన్న, గుండ్ల స్నేహలత, కన్నూరి రేణుక, కట్కూరి శ్రీవల్లి, నారగోని సరిత తదితరులు పాల్గొన్నారు.

'కాకా' ఆశయ సాధనకు కృషి చేయాలి



గోదావరిఖని: నివాళి అర్పిస్తున్న నాయకులు



సుల్తానాబాద్‌లో..

సుల్తానాబాద్: మాజీ మంత్రి వెంకటస్వామి (కాకా) ఆశయ సాధన కోసం కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాల్సిన అవసరం ఉందని బ్లాక్ కాంగ్రెస్ చైర్మన్ దామోదర్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వెంకటస్వామి విగ్రహానికి నివాళి అర్పించారు.

గోదావరిఖని: జీఎం ఆఫీస్ మూలమలుపు వద్ద ఉన్న కాకా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.



పెద్దపల్లిరూరల్: నివాళి అర్పిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు భూషణవేణి సురేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కౌన్సిలర్లు, నాయకులు కాకా చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. పేదలకు పండ్లు పంపిణీ చేశారు.

ధర్మారం: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సతీమణి రిటైర్డు ప్రిన్సిపాల్ కాంతకుమారి వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ప్రైవేటు ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

జూలపల్లి: మండల కేంద్రంలో వివేక్ యువసేన ఆధ్వర్యంలో కాకా విగ్రహానికి నివాళి అర్పించారు.

22జిడికె51: నివాళి అర్పిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో కాకా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.



ఓదెల: కొలనూర్‌లో కొవ్వొత్తులతో నివాళి

ఓదెల: మండలంలోని కొలనూర్‌లో లెవల్ క్రాసింగ్ గేట్ సమీపంలో ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్యయాదవ్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు.

సెన్సార్ బోర్డు సభ్యుడిగా 'ఖని' వాసి



అక్షరకుమార్

కోల్‌సిటీ: గోదావరిఖనికి చెందిన సినీ దర్శకుడు అక్షర కుమార్ అలియాస్ కుమార స్వామి ప్రాంతీయ సెన్సార్ బోర్డు (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికెట్) హైదరాబాద్ రీజియన్ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. తెలుగు చిత్ర పరిశ్రమలో తనదైన శైలిలో రాణిస్తున్న అక్షరకుమార్ 'నీది నాది ఒకే కథ, విరాటపర్వం సినిమాలకు పనిచేశాడు. ప్రస్తుతం 'షరతులు వర్తిస్తాయి' అనే సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. అలాగే పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్న 'షరతులు వర్తిస్తాయి' సినిమాను వచ్చే ఏడాది ఫిబ్రవరిలో విడుదల కావడానికి సిద్ధంగా ఉందని అక్షరకుమార్ తెలిపారు.

నేడు మలయాళ ఆశ్రమంలో యజ్ఞం

గోదావరిఖనిటౌన్: పట్టణంలోని బస్టాండ్ సమీపంలో గల శ్రీశ్రీశ్రీ మలయాళ స్వామి ఆశ్రమంలో సీతా జయంతి సందర్భంగా భగవద్గీత యజ్ఞం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సదానంద స్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశ కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన రాజేశ్వర శర్మ పాల్గొని మాట్లాడారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.